# గంగమ్మ తల్లి

జి. హనుమంతరావు

నీలాకాశంలో జాబిల్లి త్వరత్వరగా ప్రయాణం జేస్తూవున్నాడు. సాగరుడు, పసిపాప మాదిరిగా చేతులెత్తి పిలచినటుల, అలలతో చంద్రుణ్ణిఆహ్వానిస్తూ వున్నాడు. వెన్నెల కాంతిలో సముద్ర జలం, వెండికొండలాగ కనబడుతూవుంది.

ఆ దూరాన ఇసుక తిన్నెల్లోని పూరిగుడిశ అప్పడిది. వాని పూర్వీకులంతా అచటే నివశించారు. చేపలు పట్టుట వారి కులవృత్తి. అప్పడికా గుడిశంటే స్వర్గతుల్యం. అప్పడిభార్య ఎంకి. ఎంకంటే అతనికి అప్సరస. పొరపువిరుపూ లేకుండా సంసారనౌకను జీవిత జలధిలో మెల్లిగా నెట్టుకుంటూ వచ్చారు. వారికొక పదేళ్ళ కుర్రాడున్నాడు. వాడంటే వారిద్దరికి అతిమక్కువ.

అప్పడు, తన కొడుకు సాయంతో గంగ మీద పడవవేసి సాయంత్రానికల్లా ఐదారు పెద్ద పెద్ద వాలిగల్ని పట్టుకొచ్చేవాడు. ఎంకి పట్టణం పోయి, వాటిని అమ్మి దినానికి తమకు కావలసిన సరకుల తెచ్చేది. వాటితో వారు కాలం హాయిగా గడుపుతూ వుండేవారు.

కాలకుహరంలో మాణిక్యాలున్నాయో, కాలకూట విషముందో ఎవరికెరుక? అదృష్టదేవత ఎవరిమీద తన చిరునవ్వు విసరుతుందో, గజ్జలతల్లి ఎవరి నెత్తిమీద తన ఇనుప చేతులుపెట్టి దీవిస్తుందో ఎవరు కలగన్నారు?

పడవ నడిపేవాడు చుక్కాని అతిజాగ్రత్తగా పట్టుకున్నప్పటికి ప్రవాహ మధ్యంలో పడవ మునిగిపోవచ్చు. ఈ ప్రపంచ వ్యవస్థ, ఆ దయామయుడు తన విలాసార్థం, నిమీలిత నేత్రుడై, తలపోసిన ఒక దివ్య స్వప్నగాధ.

రేపు పూర్ణిమ. నిండు చంద్రుడు. ఆకాశంలో పికకుమారునివలె. ప్రజల సమ్మోహితుల జేయుచూ విహారం జేస్తాడు. రేపటిదినం పండుగ. అప్పడి మనస్సు జరిగిపోయిన దినాలమీదికి పోయింది. ప్రతి పండుగ బాగా గడిపేవాడు. ఆ వాళ ఏదో ఒక పిండివంట చేయించేవాడు. ఎంకికొక కొత్తచీర కట్టబెట్టే వాడు. కుర్రవానికి బట్టలు. అప్పడు సంతోషంతో పొంగిపోయాడు. సముద్రం ఆనందంతో పురకలు పెట్టింది. వుబికి, వుబికి పొంగిపోయింది.

"ఏ మేయ్! ఎంకీ, రేపు పండుగే! ఏం జేస్తా?" వన్నాడు కుతూహలంగా అప్పడు. "నేనేం జేయలేను బావా! పట్టణానికెళ్లొచ్చేటప్పటికి నాకు సాలివస్తుంది," అని నిస్సారంగా జవాబిచ్చింది ఎంకి.

అప్పడు, ఎంకి కళ్ళల్లోకి జూచాడు. గాలికి ఎంకి ముంగురులు కదలుతూ వున్నాయి.

"ఎంకీ! నే గమనించలా, అలామారి పోయావేమే? మొఖం తెల్లబడింది.

మనిషివదో ఒకంగా వున్నావు. ఇదివరకు బండెడు చాకిరిజేసేదానవు సాలంటావేందే? జబ్బేమన్నా జేసిందా?" అని అమాయకంగా అడిగాడు అప్పడు. ఎంకి మోము ఎఱ్ఱబడ్డది. తనలో తాను నవ్వుకుంది. సిగ్గుతో గుడిశలోకి దూరింది. అప్పడి కర్థమైంది—ఎంకి నీళ్లు బోసుకుందని. ఎంకి వెనకాలే గుడిశలోకి పరుగెత్తాడు. అతని బాహువుల్లో సోలిపోయింది ఎంకి.

దొంగలకు భయపడ్డ వానివలె మబ్బుల్ని చాటుగా జేసుకుంటూ శశాంకుడు నీలికొండల్లో నడుస్తూవున్నాడు. సుమారు రాత్రి రెండుగంటలౌతుంది. అప్పడు గంగలోకిపోతే మంచి చేపలు దొరకుతవి.

గంగమ్మ తల్లికి దండము బెడుతూ పడవను నీళ్ళల్లోకి తోసింది ఎంకి. తన భర్తా, కొడుకూ కనబడునంత వరకు ఒడ్డునుండి జూచింది. ఆ చంద్ర కాంతుల్లో, ఆ భయంకర తరంగాల్లో, ఆ చిన్న పడవ వూయలలూగుతూ జరిగి

పోయింది. దూరాన్ని వెండి వెలుగు తళుకుల్లో కలిసిపోయిందా పడవ. ఎంకి గంగమ్మ తల్లికి మ్రొక్కుతూ, తన పూరి గుడిశకు తిరిగి పోయింది.

ఉదయం ఎనిమిదిగంటలకు బయలుదేరింది పెద్దతుపాను. తెల్లవారి ఆరుగంటలకే తిరిగి రావలసింది తన కొడుకూ, భర్త. కాని రాలేదు. ఆమెకాతురత ఎక్కువగా సాగింది. ఎక్కువ చేపలు పట్టటానికి దూరమెళ్ళి వుంటారని సముదాయించుకుంది తన హృదయారాటాన్ని. సముద్రపు హోరు, రోదన ధ్వనివలె అతిభయంకరంగావుంది. అలలు ఎత్తునలేచి పడుతున్నవి. ఆ చిన్న పడవ ఇంకా జీవితంలో తిరిగివస్తుందా ? కాల గర్భంలో గలసిపోక— ఆమెకు, తన అప్పడూ, కొడుకూ తప్ప మరెవ్వరూలేరు. బయటగాలి దుమారం ఎక్కువైంది. పూరిగుడిశ వూగులాడుతూవుంది. మేఘగర్జనలూ. మెరుపులూ ఎక్కువైనవి. దిక్కులు పిక్కటిల్ల అరుస్తూ. భయంకర రాక్షసివలెనున్న సముద్రంవైపు జూస్తూ వుంది ఎంకి.

ఆమె మనస్సులో తన భర్త, కొడుకూ ఆలోచనలు తప్ప మరేమి లేదు. "వారు మునిగిపోతే తన గతి ! ఎంకి వణకిపోయింది యీ తలంపులో. కారుమబ్బులా దుఃఖం కమ్ముకొచ్చింది. ఆమె రోదన సముద్ర ఘోషలో కలసి పోయింది.

ఆ పగలంతా సముద్రం గర్జిస్తూనేవుంది. తుపాను దెబ్బతగ్గినట్లు కనబడుటలేదు. ఎంకికి ఒకటే చూపుబడింది. తన చిన్న పడవ పోయిన దారినే జూస్తూవుంది తన వారి రాక కొరకు. ఆమెకు అన్నం నీళ్ల లేవు ఆరోజున. అన్నం తినాలి గదా యని గూడ తట్ట లేదు ఎంకికి.

నడిరేయికి తుపాను తగ్గింది. ఎంకి వగర్చుకుంటూ సముద్రపు ఒడ్డుకు పరుగెత్తింది. ఆకాశం నిర్మలంగావుంది. తారాపతి, తాగినవాడివలె, తూలుతూ నడుస్తున్నాడు.

ప్రపంచము ప్రశాంతంగా వుంది. ఎంకికి శాంతి ఎక్కడ !

ఇంకా తన పిల్లవాడు, భర్త తిరిగి వస్తారని ఎంకి ఆశ. సముద్ర తీరాన చప్పట్లు కొట్టుకుంటూ పరుగెత్తింది. ఏముంది అంతా నిశ్శబ్దం ప్రకృతి మాత ఆమె మీద కోపగించుకుంది.

ఎంకికి దూరంగా అలలు వేనినో తాకుతున్నట్లుగా కనిపెట్టింది. కొండరాళ్ళనుకుంది.

కాదు ! కాదు !.... రెండుశవాలు.... తనభర్త. తన కుమారుడు. ఎంతటి భయానక దృశ్యం. ఆమె హృదయం భరించగలదా ? ఎంకి కుమిలి కూలిపోయింది.

సముద్రదేవుడు, మానవుల సుఖదుఃఖాలు పట్టనట్లుగా. పరిహాసంగా నీళ్ళు విరజిమ్మాడు ఆమె మీద.

---

# హాస్యం

## చీరల రకాలు !

భార్య—"ఈ సంక్రాంతి పండుగకి యెన్ని కొత్తరకాల చీరలు వస్తాయో ?"

భర్త—"మామూలుగావచ్చే రెండు రకాలే!"

భార్య—"ఏమిటవి ?"

భర్త—"నీకిష్టములేనివి ఒక రకం. నేను కొనడానికి తాహతులేనివి మరొకరకం.

★

## గొప్పతనం !

తహశీలుదారు—'అతనేనా? కొత్తగావచ్చిన క్లార్కు ?"

హెడ్‌క్లర్కు—"చిత్తం, చిత్తం."

త॥శీ॥—"చాలా కష్టపడి పనిచేశేవాడనుకుంటాను.

హె. క్ల—"చిత్తం. అదే అతని గొప్పతనమండి."

త. శీ—"ఏమిటి ?"

హె. క్ల—"కష్టపడి పనిచేస్తూవున్నట్లుగా కనబడటమే అతనియొక్క గొప్పతనమండి."

—వేముగంటి అనంతరావు